సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం ၊ 23 ၊ ఫిబ్రవరి ၊ 2023



స్థల పరిశీలన

వీర్నపల్లి(సిరిసిల్ల): ధాన్యం నిలువ చేసేందుకు గోదాములు నిర్మిస్తున్నట్లు డీఎంవో ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లిలో బుధవారం స్థలాన్ని పరిశీలించారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు బుధవారం 20 వేల మంది భక్తులు వచ్చారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
36.0/18.0

వాతావరణం

ఆకాశం కొంతమేరకు మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ సాధారణ స్థాయిలో ఉంటుంది.

న్యూస్‌రీల్

10 జీపీఏ లక్ష్యంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదోతరగతి విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలకు సంసిద్ధులు కావాలని, పది జీపీఏ లక్ష్యంగా చదువాలని రాష్ట్ర పరిశీలకుడు రమేశ్ కోరారు. వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు. స్టడీ అవర్స్, ప్రీ ఫైనల్ పరీక్షలు, వీకెండ్ టెస్ట్, అడాప్టేషన్ లిస్ట్, తల్లిదండ్రుల లెటర్లు, ఏబీసీ గ్రేడింగ్ లిస్టులను పరిశీలించారు. రమేశ్ మాట్లాడుతూ పరీక్షల సమయం వరకు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ శైలజ, మండల నోడల్ అధికారి మద్దికుంట లక్ష్మణ్, క్లస్టర్ నోడల్ అధికారి శేఖర్ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీధర్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ సర్పంచ్‌పై వచ్చిన ఫిర్యాదులపై వేములవాడ ఎంపీవో శ్రీధర్ బుధవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్ అవకతవకలకు పాల్పడినట్లు అదే గ్రామానికి చెందిన ఏడుమ్యాకల మధుకర్ కలెక్టర్‌తోపాటు మండల అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుతో ఎంపీవో శ్రీధర్ గ్రామానికి వెళ్లారు. సర్పంచ్ వేణు గ్రామంలో చేపట్టిన పల్లె ప్రకృతివనం, హరితహారం, ట్రాక్టర్ డీజిల్ నిర్వహణ, సీసీ రోడ్డు తోపాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పూర్తి రికార్డులు పరిశీలించిన తర్వాత అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎంపీవో శ్రీధర్ తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్ వేణును వివరణ కోరగా.. ఎలాంటి అవకతవకలు జరుగలేదన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.82 కోట్లు



నగదు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 15 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.82 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య బుధవారం హుండీలను లెక్కించారు. 309 గ్రాముల బంగారం, 19 కిలోల 460 గ్రాముల వెండి సమకూరినట్లు చెప్పారు.

27న సాహిత్య సదస్సు

సిరిసిల్లకల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించే సాహిత్య కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 27న గంభీరావుపేట కేజీ టు పీజీ కాంప్లెక్స్ భవనంలో లిటరరీ ఫోరమ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి తెలిపారు. మానేరు రచయితల సంఘంతో కలిసి నిర్వహిస్తున్న ఈ ఫోరమ్‌లో తెలంగాణలో బాలసాహిత్య వికాసం అంశంపై గరిపెల్లి అశోక్, డాక్టర్ బీవీఎన్ స్వామి, వాసరవేని పరశురాం, డాక్టర్ నమిలికొండ సునీత పత్ర సమర్పణ చేయనున్నట్లు వివరించారు. సాహితీప్రియులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బంధువులను పరామర్శించిన శోభమ్మ



పరామర్శిస్తున్న సీఎం సతీమణి శోభమ్మ

ముస్తాబాద్(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ సతీమణి శోభమ్మ సమీప బంధువులను బుధవారం పరామర్శించారు. మోహినికుంటకు చెందిన కల్వకుంట్ల చక్రధర్‌రావు అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన కుటుంబ సభ్యులను శోభమ్మ పరామర్శించారు. చక్రధర్‌రావు మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. చక్రధర్‌రావు భార్య పరంధామ, కుమారుడు వరప్రసాద్‌రావులను ఓదార్చారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచ్ కల్వకుంట్ల వనజ, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్‌రావు, యాదగిరిగౌడ్, సతీశ్ ఉన్నారు.

పిక్కలు తీస్తున్నాయ్..

- జిల్లాలో కుక్కల స్వైరవిహారం
- యాభై రోజుల్లో 474 మందిపై దాడులు
- జిల్లా వ్యాప్తంగా పెరిగిన కేసులు
- వాహనదారులను వెంటాడుతున్న వైనం

జిల్లాలో కుక్క కాటు వివరాలు

2019	2,464
2020	2,914
2021	3,446
2022	3,812
2023	474(ఇప్పటికీ..)
మొత్తం	13,110

ఈ ఏడాది కొత్త సంవత్సరం ఉదయం 6:30 గంటలకు సిరిసిల్లకు చెందిన వ్యాపారి వాకింగ్‌కు వెళ్లారు. చంద్రంపేటలో నడుస్తుండగా అక్కడే ఉండే ఓ కుక్క దాడి చేసి పిక్కలు కొరికేసింది. సదరు వ్యాపారి బంధువులకు ఫోన్‌చేయగా వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అది పిచ్చికుక్కనా.. మంచిదా అంటూ కొన్ని రోజులపాటు ఆ కుక్కను కనిపెట్టుకుని ఉన్నారు. చివరికి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



సిరిసిల్లలోని ఓ వీధిలో కుక్కల గుంపు సంచారం

సిరిసిల్లటౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లాలో కుక్కలు రెచ్చిపోతున్నాయి. ఉదయం వాకింగ్ వెళ్లే వారి పిక్కలు తీస్తున్నాయి. కార్ల వెంట పరుగెడుతూ వాహనాల్లో ప్రయాణించే వారిలో భయాందోళన కలిగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది యాభై రోజుల్లోనే 474 మందిపై కుక్కలు దాడి చేశాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కడ చూసినా.. భౌ..బోయ్

జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసిన కుక్కలే కనిపిస్తున్నాయి. వాహనాలపై వెళ్లున్న వారిని వెంబడిస్తూ దాడి చేస్తున్నాయి. ఒకేసారి పదుల సంఖ్యలో వీధికుక్కలు వెంట పడుతుండడంతో ఏమి చేయలేకపోతున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కుక్కల జనాభా నియంత్రణకు చర్యలు చేపట్టేవారు. రెండేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంతానం విపరీతంగా పెరిగిపోయింది.

తెలుసుకోవాల్సిన అంశాలివీ

- పెట్‌డాగ్స్‌కు వ్యాక్సిన్ వేయించాలి.
- సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను మున్సిపల్ డ్రై రీసోర్స్ పార్కులో నిర్వహిస్తున్నారు. పల్లెల్లో కనిపించడం లేదు.
- గజ్జికుక్కలు కరిస్తే ప్రాణాంతకం కాబట్టి.. కరిచిన కుక్కను కనిపెట్టాలి. దాని నోటి నుంచి సొల్లు కారితే.. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- జిల్లాలో వీధికుక్కల కుటుంబ నియంత్రణ ఏజెన్సీ లేదు.
- కుక్క కరువగానే డిటర్జెంట్ లేదా డెటాల్ సబ్బుతో గాయాన్ని శుభ్రం చేయాలి.
- కుక్క కరిస్తే 'రక్ష రాబ్' ఇంజెక్షన్ వేయించుకోవాలి.

వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్కకాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా సత్వర చికిత్స చేయాలని సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు నాటువైద్యం చేయించుకోకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చు. – డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో, సిరిసిల్ల

కంట్రోల్ చేస్తున్నాం



వీధికుక్కలకు యాంటిరాబిస్ ఇంజెక్షన్లు వేయిస్తున్నాం. సిరిసిల్ల డ్రై రీసోర్స్ పార్కులో ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) నిర్వహిస్తున్నాం. త్వరలోనే మళ్లీ శిబిరం నిర్వహించి కుక్కలకు వ్యాక్సిన్లు, బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తాం. – వి.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

కలెక్టరేట్‌లో పిల్లలకో గది



సిరిసిల్లకల్చరల్: పసిబిడ్డలున్న ఉద్యోగినుల సౌకర్యార్థం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సరికొత్త సౌకర్యాన్ని కల్పించారు. కలెక్టరేట్ సముదాయంలో క్రైచ్(పిల్లల సంరక్షణ గది) ఏర్పాటు చేశారు. ఆరు నెలల వయసు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు ఈ సంరక్షణ కేంద్రంలో ఆడుకోవచ్చు. విశ్రాంతి తీసుకోవచ్చు. మంత్రి కేటీఆర్ మార్గదర్శనంతో పిల్లలు గల ఉద్యోగినుల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం, చల్లని, వేడి నీరు, వంట సామగ్రి, వాష్‌రూమ్స్, ఆట వస్తువులు, పజిల్స్, బొమ్మలు, స్మార్ట్ టీవీ, ఇండోర్, ఔట్‌డోర్ ఆటల పరికరాలతోపాటు బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం సారథ్యంలో ఈ కేంద్రాన్ని నిర్వహించనున్నారు. త్వరలోనే అధికారికంగా ప్రారంభించనున్నారు.





ఆలయ ఉద్యోగుల్లో అలజడి !

- విజిలెన్స్ కేసులు, అవినీతి ఉద్యోగుల జాబితా కోరిన కమిషనర్
- రాష్ట్రంలోని 7 ప్రధాన ఆలయాల ఈవోలకు ఆదేశం
- జాబితా తయారు చేస్తున్న అధికారులు
- బదిలీలకు రంగం సిద్ధం

వేములవాడ: రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. గతంలో విజిలెన్స్ కేసులు ఎదుర్కొన్న ఉద్యోగులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొంతకాలంగా అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ నుంచి ఇటీవల రాష్ట్రంలో ఏడు ఆలయాల ఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఐదు రోజుల్లో జాబితా పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజన్న ఆలయ సిబ్బందిలో విజిలెన్స్ కేసులో 14 మంది, అవినీతి అక్రమాలకు పాల్పడిన 16, క్రమశిక్షణారాహిత్యంతో విధులు నిర్వహించిన 25 మందితో ఉద్యోగుల వివరాలతో జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈమేరకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాబితా సిద్ధం చేయడం ఆలస్యమైందని, త్వరలోనే అందజేస్తామని బుధవారం 'సాక్షి'కి తెలిపారు. రాజన్న గుడితోపాటు కొండగట్టు ఆంజనేయస్వామి, యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, కొమురవెల్లి మల్లికార్జునస్వామి, బాసర జ్ఞానసరస్వతీ ఆలయం, సికింద్రాబాద్ గణేశ్ దేవాలయాల ఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

కొండగట్టుకు సీఎం రాకతో

ఈనెల 18న సీఎం కేసీఆర్ కొండగట్టు ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ ఉద్యోగులు సీఎంను కలిసి, ఉద్యోగుల కొరత ఉందని, వెంటనే నియమించాలని, బదిలీపై వెళ్లిన వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని విన్నవించారు. వెంటనే స్పందించిన సీఎం కేసీఆర్ తన వెంట ఉన్న రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ను పిలిచి మాట్లాడారు. ఈ క్రమంలో కేసులు, అవినితి అక్రమాలకు పాల్పడిన వారి జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

బదిలీలలకు రంగం సిద్ధం

అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆలయ ఉద్యోగులు, విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటుకున్న ఉద్యోగులను ఇతర దేవాలయాలకు బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో ఉద్యోగుల్లో అలజడి పెరిగింది.

విద్య, వైద్యరంగాలకు పెద్దపీట

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- వీటీడీఏ పనులపై సమీక్ష
- హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత నిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.5 కోట్ల పనులకు బుధవారం భూమిపూజ చేశారు. విద్యావ్యాప్తి కోసం ప్రభుత్వం అనేక నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు సీఎస్ఆర్ నిధుల్లో రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి

టెంపుల్‌టౌన్ డెవలప్‌మెంట్‌కు కట్టుబడి ఉన్నాం

వేములవాడ పట్టణం, రాజన్న ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో బుధవారం వీటీడీఏ, రెవెన్యూ, మున్సిపల్, ఆలయ అధికారులతో సమావేశమయ్యారు. రానున్న ఆరు నెలల్లో రూ.50 కోట్ల పనులు పూర్తి చేయాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రూ.10 కోట్లతో గుడి చెరువు సుందరీకరణతోపాటు 800 మీటర్ల మేరకు పుష్కరఘాట్లు నిర్మించాలన్నారు. తిప్పాపూర్ నుంచి గుడి వరకు రోడ్ల విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం, వేదపాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఆర్కిటెక్ట్ ముక్తేశ్వర్, వీటీడీఏ సెక్రటరీ భుజంగరావు, ఎస్టేట్ ఆఫీసర్ గంప సత్యనారాయణ పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇప్పించండి

వేములవాడరూరల్: ప్రభుత్వం చేపట్టే ప్రతీ పథకంలో తమ సేవలు వినియోగించుకుంటున్నప్పటికీ గౌరవ వేతనం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు ఐకేపీ, వీవోల సభ్యులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.18వేలు అందించాలని, హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

మెస్సేజ్ యువర్ ఎస్పీ

- నంబర్ 63039 22572
- ఫిర్యాదుల పరిష్కారానికి వేదిక



అఖిల్ మహాజన్, ఎస్పీ

సిరిసిల్లక్రైం: సమస్య ఏదైనా ఒక్క మెస్సేజ్ చేయండి నిమిషాల్లో పరిష్కరిస్తామంటున్నారు ఎస్పీ అఖిల్‌మహాజన్. ఎలాంటి సమస్య అయిన 63039 22572 నంబర్‌కు మెస్సేజ్ చేయవచ్చని కోరారు. బుధవారం పలు వివరాలు వెల్లడించారు. మెస్సేజ్ యువర్ ఎస్పీ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమాన్ని తానే స్వయంగా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నట్లు వివరించారు. నేరాలు, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, రోడ్డు ప్రమాదాలు, అక్రమ రవాణా.. సమస్య ఏదైన మెస్సేజ్ రూపంలో తెలియజేస్తే వెంటనే స్పందించి ఆ పరిధిలోని డీఎస్పీలు ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించనున్నట్లు చెప్పారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ప్రాణం పోయినా.. పైసా రాలే !

- గీతకార్మిక కుటుంబాల అరిగోస
- పెండింగ్‌లో దరఖాస్తులు
- ఏడాదిగా అందని ఎక్స్‌గ్రేషియా
- నిధులున్నా లబ్ధి సున్నా

జిల్లాలో ఏడాదిలో జరిగిన ప్రమాదాల వివరాలు

మృతులు	పూర్తివైకల్యం
5	2
పాక్షిక వైకల్యం : 14	

జిల్లాలో గీతకార్మిక సంఘాలు

సొసైటీలు	టీఎఫ్‌టీలు
125	85
గీతకార్మికులు : 10,200	



'కులవృత్తిలో భాగంగా కల్లు గీతకు వెళ్లి తాటి చెట్టుపైనే గుండెపోటు వచ్చి మృతి చెందిన గీతకార్మికుడి పేరు గుగ్గిళ్ల కిష్టయ్య తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి. ఇతనికి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. ఇద్దరికి పెళ్లికాగా.. మరో అమ్మాయికి ఈ మార్చిలో పెళ్లి చేయనున్నారు. మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోయాడని ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని 2021 డిసెంబర్ 21న దరఖాస్తు చేసుకున్నారు. ఏడాది గడిచిన ఆ కుటుంబానికి చిల్లిగవ్వ సాయం అందలేదు. ఆబ్కారీ శాఖ నుంచి రూ.5 లక్షలు వస్తాయనే ఆశతో కిష్టయ్య కుటుంబం ఎదురుచూస్తోంది.

సిరిసిల్లక్రైం: గౌడకులస్తులు ఉపాధి కోసం నిత్యం ప్రమాదాలతో సహవాసం చేయాల్సిందే. ఆకాశమంత ఎత్తులో ఉంటే చెట్లపైకి మోకు సాయంతో ఎక్కి కల్లు తీస్తేనే కడుపు నిండేది. నేటితరంలో చాలా మంది ఈ వృత్తిలోకి రావడం లేదు. వచ్చిన వారికి భరోసా లేక భయాందోళన చెందుతున్నారు. గీతకార్మికుల కోసం వచ్చిన కొన్ని సంక్షేమ పథకాలు సైతం సరిగ్గా అందక చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏడాదికాలంగా కల్లు తీస్తూ గాయపడ్డ, మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం డబ్బులు అందలేదు. ఆయా కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురుచూస్తున్నాయి.

ఎక్స్‌గ్రేషియా అందేదెప్పుడో ?

- గీతకార్మికులు ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి పడి మృతిచెందినా, వృత్తి చేయడానికి వీలు లేకుండా గాయపడ్డ ఆయా కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వాలి.
- పాక్షికంగా వైకల్యమైతే రూ.10 వేలు అందించాలని ఉత్తర్వులు ఉన్నాయి.
- 2021 నుంచి ఇప్పటి వరకు ఐదుగురు కార్మికులు మృతిచెందారు. మరో ఇద్దరు పూర్తిగా వైకల్యం పొందారు. మరో 14 మంది కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ మూడు సంఘటనలలో ఏ ఒక్క కుటుంబానికి కూడా పరిహారం అందలేదు.


పెరిగినా ఫలితమేది..

గీతకార్మికుల కుటుంబాల సహాయార్థం 2017 సంవత్సరానికి ముందు కార్మికుడు మృతిచెందితే రూ.2 లక్షలు, పూర్తి వైకల్యానికి రూ.50 వేలు, స్వల్ప వైకల్యానికి రూ.10 వేలు అందించేది. 2017 జూలై 14 నుంచి పరిహారం పెంచింది. అయితే సకాలంలో అందక ఆయా కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఆబ్కారీశాఖ నుంచి గుర్తింపుకార్డు ఉన్న వారికే ఈ ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంది.

నిధులు పంపిణీ చేసినట్లు ఉత్తర్వులు !

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరిగిన ప్రమాదాల్లోని గాయపడ్డ, మృతిచెందిన గీతకార్మికుల కుటుంబాల సహాయార్థం నిధులు పంపిణీ చేసినట్లు 2022 జూలై 15న రాష్ట్ర ఆబ్కారీ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు రూ.36.40 లక్షలు వచ్చినట్లు ఉంది. కానీ దరఖాస్తుదారులకు మాత్రం పరిహారం అందలేదు. నిధుల మంజూరీలో జాప్యంతోనే ఇవ్వడం లేదని జిల్లా ఆబ్కారీ అధికారులు వెల్లడిస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆవేదనగా చెబుతున్నారు.

నిధులు రావాలి



మా పరిధిలో చేయాల్సినవి అన్ని చేశాం. దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే వారి ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయి. మా కార్యాలయం పరిధిలో పెండింగ్ ఏమి లేదు.

– పంచాక్షరీ, ఆబ్కారీశాఖ జిల్లా పర్యవేక్షణాధికారి, సిరిసిల్ల

కూతురు పెళ్లికి అందితే బాగుండు



నా భర్త కిష్టయ్య కల్లు గీత కోసం తాటిచెట్టు ఎక్కి చెట్టుపైనే మృతి చెందాడు. ఐదుగురు పిల్లలు గల మా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మూడో అమ్మాయి పెళ్లి మార్చిలో చేయాల్సి ఉంది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలు వస్తే సహాయం చేసినట్లు అయితది. మా అబ్బాయికి చదువు కోసం ఖర్చు అవుతుంది. ఇంకో అమ్మాయి కూడా ఉంది. మా పరిస్థితి గమనించి సహాయాన్ని అందించాలి.

– గుగ్గిళ్ల పద్మ, బద్దెనపల్లి(తంగళ్లపల్లి)

క్లుప్తంగా

పరిచారకుల నియామకానికి రంగం సిద్ధం

వేములవాడ: రాజన్న ఆలయంలో మరో 11 మంది పరిచారకుల నియామకానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ నుంచి ఆలయానికి ఆదేశాలు అందినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇందుకు ఆలయ ఈవో, రాష్ట్ర దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కరీంనగర్, ఆలయ స్థానాచార్యులతో కలిపి సెలెక్షన్ కమిటీగా నియమించారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రామిండ్ల అభిశేక్ జిల్లాస్థాయి టాలెంట్ పరీక్షలో మొదటి స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు బుధవారం ఉపాధ్యాయులు తెలిపారు. చదువులో రాణిస్తున్న అభిషేక్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

20 వాహనాలు సీజ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ మొగిలి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో లైసెన్స్‌లు, హెల్మెట్ లేని 20 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. ఎస్సై శేఖర్, ఏఎస్సై కిషన్‌రావు ఉన్నారు.

బియ్యం సంచి 46 కిలోలే !



రేషన్‌షాపులో తూకం వేసిన సంచి

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామంలోని ఓ రేషన్‌దుకాణంలో బియ్యం బస్తా 46 కిలోలు మాత్రమే వచ్చింది. 50 కిలోలు ఉండాల్సిన బస్తాలో నాలుగు కిలోలు తక్కువగా రావడంతో రేషన్ డీలర్ అవాక్కయ్యారు. ప్రతీ నెల తక్కువగానే బియ్యం వస్తున్నాయని మండలంలోని పలువురు రేషన్ డీలర్లు వాపోయారు.

ఆదాయమున్నా.. అభివృద్ధి లేదు !

- పేరుకే గ్రేడ్–1 మార్కెట్
- రెండేళ్లుగా నిలిచిన కొనుగోళ్లు
- వెలవెలబోతున్న వేములవాడ మార్కెట్ యార్డు
- చెక్‌పోస్టుల ద్వారానే ఆదాయం



వెలవెలబోతున్న మార్కెట్ యార్డు

వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లాలోనే అత్యధిక ఆదాయం వచ్చేది వేములవాడ మార్కెట్‌యార్డు. ఈ మార్కెట్‌యార్డు పరిధిలో వేములవాడరూరల్, అర్బన్, కోనరావుపేట మండలాలు ఉన్నాయి. జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల, పోత్గల్, గంభీరావుపేట, రాచర్లబొప్పాపూర్, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయినపల్లితో కలుపుకుని ఎనిమిది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అన్నింటి కంటే వేములవాడమార్కెట్ యార్డు ద్వారా ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం పట్టింపు కరువైంది.

రెండేళ్లుగా నిలిచిన కొనుగోళ్లు

వేములవాడ మార్కెట్‌యార్డులో రెండేళ్లుగా కొనుళ్లు లేవు. ఈ మార్కెట్‌యార్డులో ఐదు ఎకరాల స్థలంలో రెండు ఎకరాలను వేములవాడ మున్సిపల్‌శాఖకు కూరగాయల మార్కెట్ కోసం అప్పగించారు. ఇక మిగిలిన మూడు ఎకరాలలో గోదాంల షెడ్లు ఉండడంతో ఇరుకుగా మారింది. ఈ మార్కెట్‌యార్డును నూతన హంగులతో మర్రిపల్లిలో నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేవు. రెండేళ్లుగా ఎలాంటి కొనుగోళ్లు చేపట్టకపోయినప్పటికీ చెక్‌పోస్టుల ద్వారా ఏటా రూ.2 కోట్లకు పైగా ఆదాయం ఈ మార్కెట్‌యార్డు నుంచి ప్రభుత్వానికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా కోనాయపల్లి, తిప్పాపూర్ గ్రామాల్లో ఉన్న చెక్‌పోస్టుల ద్వారా సీజన్‌లో నిత్యం దాదాపు రూ.50 వేల వరకు వాహన చలాన్‌ల ద్వారానే సమకూరుతుందని అధికారులు తెలిపారు.

సౌకర్యాలు అంతంతే..

గ్రేడ్–1 మార్కెట్‌యార్డుగా ఆదాయంలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉన్నప్పటికీ సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండడంతో ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నారు. వాచ్‌మెన్, డ్రైవర్, ఇతర సిబ్బంది పోస్టులు కూడా ఏళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ప్రతీ నెల వేతనాలు సైతం అందడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులు ఇద్దరు ఉండగా, కార్యదర్శి ఒక్కరు, 10 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో ఐదుగురు పింఛన్‌దారులు ఉన్నారు.

ప్రజాగోస.. బీజేపీ భరోసా

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ 167, 168 బూత్ కమిటీలలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి మైలారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకురావాలన్నారు. అసెంబ్లీ ప్రభారి మీసాల చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోశ్‌బాబు, గోపు బాలరాజు, నేర్ల సాయి, నాగుల మోక్షిత్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

సర్కార్ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు



లింగంపేటలో గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

చందుర్తి(వేములవాడ): సర్కార్ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. చందుర్తిలో రూ.1.56 కోట్లతో 30 పడకల ఆస్పత్రికి, లింగంపేటలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనానికి బుధవారం రాత్రి భూమిపూజ చేశారు. ట్రైసైకిళ్లను, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైనా వైద్యం అందించేందుకు ముప్పై పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాల స్థానాల్లో కొత్త భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. చందుర్తిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ లావణ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి, సనుగుల సింగిల్‌విండో చైర్మన్‌లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సర్పంచులు దప్పుల లక్ష్మి, లక్ష్మీరాజం, ఎంపీటీసీలు పెగ్గర్ల రమేశ్‌రావు, పులి రేణుక, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిన్నెలా మరిచారు నందీశ్వరా..!

వేములవాడరూరల్: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 17, 18, 19 మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా శివరాత్రి మహోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు వేములవాడ ప్రధాన కూడళ్లను ముస్తాబు చేశారు. జగిత్యాలకు వెళ్లే సాయిరక్ష ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన నంది విగ్రహాన్ని మాత్రం అధికారులు ఆవిష్కరించలేదు. మహాజాతర సందర్భంగా పట్టణ సుందరీకరణ పనులను ఆగమేఘాల మీద పూర్తి చేసిన అధికారులు నందీశ్వరుడిపై కప్పిన ముసుగును మాత్రం తొలగించలేకపోయారు.

'రాళ్లపేట క్రషర్ సక్రమంగానే ఉంది'

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం రాళ్లపేట పరిధిలో ఉన్న స్టోన్ క్రషర్ గ్రామపంచాయతీకి పన్నులు ఎగవేస్తూ, ప్రభుత్వ భూముల్లోని గుట్టలను అక్రమంగా మైనింగ్ చేస్తోందని తెలుపుతూ.. ఈనెల 13న 'హద్దులు దాటి.. గుట్టలు లూటీ' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని మైనింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, మండల గిర్దవార్, మండల సర్వేయర్లు మంగళవారం తనిఖీలు చేసినట్లు మైనింగ్‌శాఖ ఏడీ సైదులు ప్రకటన జారీ చేశారు. సదురు స్టోన్ క్రషర్ నిర్వాహకులు గతంలో నిబంధనలు అతిక్రమించినందుకు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని పేర్కొన్నారు.

పనిచేసిన వారికే గుర్తింపు..

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



పెంట శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): చురుకుగా పనిచేసే కార్యకర్తల సేవలను అధిష్ఠానం గుర్తిస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చందుర్తి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులైన పెంట శ్రీకాంత్‌ను బుధవారం సన్మానించి మాట్లాడారు. చందుర్తి మండలం మూడపల్లికి చెందిన పెంట శ్రీకాంత్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని అధిష్ఠానం గుర్తించిందన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మల్లేశం, జిల్లా నాయకులు ముస్కు ముకుందరెడ్డి, గొట్టె ప్రభాకర్, ఇందూరి మధు, మండల నాయకులు పులి సత్యం, దారం చంద్రం, దూది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే కేటీఆర్‌పై పోటీ చేస్తా

- కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే మంత్రి కేటీఆర్‌పై సిరిసిల్లలో పోటీ చేసి గెలుస్తానని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం అవకాశం ఇస్తే సిరిసిల్ల నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తానన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసులు, డబ్బు అండతో పరిపాలించే ఏ ప్రభుత్వం కూడా చరిత్రలో నిలవబోదన్నారు. ప్రశ్నించే గొంతుకలను కేటీఆర్ అణచివేస్తున్నారన్నారు. మంత్రి సిరిసిల్లలో పర్యటించిన ప్రతీసారి కాంగ్రెస్ నాయకులను అరెస్టులు చేయడం పోలీసుల అత్యుత్సాహమేనని పేర్కొన్నారు. హాత్‌సే హాత్ జోడో యాత్ర మార్చి మొదటి వారంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాబోవు ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన దీటి మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి నగదు, బియ్యం అందించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, దీటి నర్సింలు, అగుళ్ల రాజేశం, ఉపేంద్ర, తుపాకుల శ్రీనివాస్, సత్యనారాయణ, సిద్దారెడ్డి, తలారి నర్సింలు, ఉపేంద్ర పాల్గొన్నారు.

స్కూల్ భవనం అప్పగించండి

- ఎస్పీకి హెచ్‌ఎం వినతి



ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎం భాగ్యరేఖ

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాల పునర్ విభజన సమయంలో జిల్లా పోలీసు కార్యాయల నిర్వహణకు పోలీసుశాఖ తీసుకున్న పాఠశాల భవనాన్ని మళ్లీ విద్యాశాఖకు అప్పగించాలని పాఠశాల హెచ్‌ఎం భాగ్యరేఖ ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతిపత్రాన్ని అందించారు. సిరిసిల్లలోని బాలికల పాఠశాల ఆధీనంలోని ఒకేషనల్ కోర్సు నిర్వహణకు వినియోగించే భవనాన్ని సిరిసిల్ల జిల్లాగా ఆవిర్భవించిన అనంతరం పోలీసు కార్యాలయం నిర్వహణకు తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం భవనం సిరిసిల్ల బైపాస్‌లో నిర్మాణం జరిగిన నేపథ్యంతో ఇక పాఠశాల భవనాన్ని యథావిధిగా తమ విద్యార్థుల అవసరాల నిమిత్తం అప్పగించాలని కోరినట్లు తెలిపారు. కానీ ప్రస్తుత డీపీవో కార్యాలయాన్ని సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంగా మార్చడంతోపాటు కమాండ్ కంట్రోల్ ఏర్పాటు యోచన ఉందని గతంలో ఎస్పీగా పనిచేసిన రాహుల్‌హెగ్డే నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. కొత్తగా వచ్చిన ఎస్పీ అఖిల్‌మహాజన్ భవనం విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

'ఈశ్రమ్'తో జర్నలిస్టులకు ప్రయోజనాలు



ఈశ్రమ్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న రఫీ

సిరిసిల్లటౌన్: జర్నలిస్టులకు ఈశ్రమ్‌తో అనేక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా పౌరసమాచార అధికారి ఎండీ రఫీ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన 'ఈశ్రమ్' శిబిరంలో భాగంగా పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ లేని ప్రతీ ఒక్క జర్నలిస్టు ఈశ్రమ్‌లో నమోదుకు అర్హులని పేర్కొన్నారు. పేరు నమోదు చేసుకున్న కార్మికులు, జర్నలిస్టులు మరణించిన, శాశ్వతంగా అంగవైకల్యం కలిగిన రూ.లక్ష బీమా వర్తిస్తుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం అందించే గుర్తింపుకార్డుతో అన్ని సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్న వారికి కొత్తకార్డులను అందించారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు నారాయణ, కాయితి మహేందర్, అతికం రఘు, కాంభోజు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను జాగృతం చేస్తున్నాం

- రాణిరుద్రమ



మాట్లాడుతున్న రాణిరుద్రమ

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రజాగోస.. బీజేపీ భరోసాతో ప్రజలను జాగృతం చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం గజసింగవరంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్నర్ సమావేశంలో రాణిరుద్రమ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పోరాడే హక్కు పార్టీలకు ఉందన్నారు. బీజేపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో బూత్‌లెవెల్ సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ పరిపాలనపై నమ్మకం ఉంటే.. సిరిసిల్ల పర్యటనకు వచ్చినప్పుడు.. బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేయకుండా ఉండగలరా అని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదని, అర్హులకు పింఛన్లు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందన్నారు. నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, శీలం రాజు, రెడ్డబోయిన గోపి, మల్లారెడ్డి, వాజీద్ హుస్సేన్, అశోక్, మహేశ్‌యాదవ్, కృష్ణకాంత్, రాజిరెడ్డి, రవీందర్, దేవయ్య, గణేశ్, శ్రీనివాస్‌రెడ్డి, విగ్నేశ్, శ్రీశైలం, నాగుల శ్రీను పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



చందుర్తిలో నట్టల నివారణ మందు వేస్తున్న అధికారులు

చందుర్తి(వేములవాడ): మూగజీవాల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య పేర్కొన్నారు. చందుర్తి మండలం రామన్నపేట, చందుర్తి గ్రామాల్లో బుధవారం నట్టల నివారణ మందు పంపిణీని తనిఖీ చేశారు. చందుర్తి, రామన్నపేటల్లో 1,850 గొర్రెలకు, 300 మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. సర్పంచులు దుమ్ము అంజయ్య, సిరికొండ ప్రేమలత, ఎంపీటీసీలు, పశువైద్యాధికారి నితిన్‌కుమార్, సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారులోని సిరిసిల్ల–వేములవాడ రహదారి లో ట్రాలీ ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గొల్లపల్లిలో ఇద్దరికి..

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మాచారెడ్డి మండలం సోమారిపేటకు చెందిన సురేశ్, నవీన్ బైక్‌పై సిరిసిల్ల వైపు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నవీన్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

మల్లారంలో ఇద్దరికి..

వేములవాడరూరల్: మండలంలోని జయవరం, మల్లారం గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మల్లారం వైపు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.

'ప్రభుత్వ స్థలాల్లో పేదలకు గుడిసెలు వేస్తాం'



తహసీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ నిరుపేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పేదలకు గుడిసెలు వేస్తామని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కోడం రమణ హెచ్చరించారు. స్థానిక తాడూర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం ర్యాలీగా వచ్చిన ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పి.సదానందంకు వినతిపత్రం అందజేశారు. రమణ మాట్లాడుతూ పేదలకు కనీసం నిలువ నీడ లేదన్నారు. తొమ్మిదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పూర్తి చేయడం లేదని ఆరోపించారు. నాయకులు మోర అజయ్, గోవిందు లక్ష్మణ్, శ్రీరాముల రమేశ్‌చంద్ర, కుడిక్యాల కనకయ్య, గోరంతల రాజమల్లు, పులి గోపాల్, వేణు, పోచమల్లు, మహేశ్, సాయి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీఆర్ఎస్

- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

సిరిసిల్లటౌన్: ప్రశ్నించే గొంతుకలను తొక్కిపెట్టేలా బీఆర్ఎస్ సర్కారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు విమర్శించారు. సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వరంగల్‌లో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ దళిత యువకుడిని హత్య చేయడానికి ప్రయత్నించారని ఇప్పటికీ ఆయనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, సంగీతం శ్రీనాథ్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనానికి యత్నం

వరంగల్ ఘటనపై యూత్‌కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు మునిగెల రాజు, రెడ్డిమల్ల భాను, చిందం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక స్థలాన్ని కాపాడండి

సిరిసిల్లటౌన్: శ్రామికుల కష్టార్జితంతో భవన నిర్మాణ కార్మికుల కోసం కొన్న స్థలాన్ని అక్రమార్కుల నుంచి రక్షించాలని కలెక్టర్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ సిరిసిలలోని నటరాజ్ థియేటర్ సమీపంలో 1980 కాలంలో తమ సంఘం పెద్దలు గుంటస్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సదరు స్థలాన్ని కొందరు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు కార్మికులకు అండగా నిలవాలని కోరారు. ఎస్.కె.మహబూబ్, పోకల దేవయ్య, బాలవ్వ, రాజు, బాలు, కైలాషం పాల్గొన్నారు.